క్లుప్తంగా

కోదండ రామస్వామి ఉత్సవాలు



వనపర్తి రూరల్: మండలంలోని పెద్దగూడెం లోని కోదండ రామస్వామి ఆలయంలో శ్రీరామ నవమి ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం ఆలయంలో మంగళ వాయిద్యాలు, వేద పండితుల వేద మంత్రోచ్చరణలతో ఉదయం పుణ్యాహవాచనం, రాత్రి అంకురార్పన పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు రమణశర్మ తెలిపారు. భక్తులు గోవిందనామ స్మరణతో కార్యక్రమాన్ని వీక్షించారు. వేడుక అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది, మాజీ సర్పంచ్ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించండి

ఆత్మకూర్: పట్టణ ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ శశిధర్ అన్నారు. బుధవారం సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి పన్నులు వసూలు చేశారు. పన్నులు చెల్లించని మస్జీద్ కాంప్లెక్స్‌లోని 20 షాపులను సీజ్ చేశారు. ఈ ఏడాది పన్నుల వసూలు లక్ష్యం రూ.2.39 కోట్లకు గాను ఇప్పటివరకు రూ.1.41 కోట్లు వసూలు చేయగా.. రూ. 98 లక్షలు పైగా బకాయిలు ఉన్నాయని తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్ గడువు పొడగింపు

ఎల్‌ఆర్‌ఎస్ గడువును ఈ నెల చివరి వరకు పొడగించారని, 25 శాతం రాయితీతో ఎల్‌ఆర్‌ఎస్‌ను పునరుద్ధరించుకోవాలని కమిషనర్ శశిధర్ కోరారు.

మెడికల్ టెక్నీషియన్ డే



వనపర్తి రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ డే దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఈఎమ్‌ఈ రత్నమయ్య, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌తో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపద సమయంలో క్షతగాత్రులని ఆస్పత్రికి తరలించడం కోసం తమ వంతు పాత్ర పోషిస్తున్నామని తెలిపారు.

కూలర్ వితరణ

ఆత్మకూర్: ఆత్మకూర్ క్లస్టర్‌లోని అంగన్‌వాడీ సెంటర్ 7లోని చిన్నారులకు ఉక్కపోత నుంచి ఉపశమనం కలిగించేందుకు కాలనీకి చెందిన అమీర్‌అహ్మద్ కుమారుడు మహ్మద్ అజ్లాన్ రూ.8వేల విలువ చేసే కూలర్‌ను టీచర్ రఫీఖాబానుకు అందించారు. కార్యక్రమంలో సీడీపీఓ లక్ష్మమ్మ, సూపర్‌వైజర్ శ్రీలత, టీచర్ రఫీఖాబాను, ఆయా నర్సమ్మ పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

పాన్‌గల్: తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగిన వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన నలుగురిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తెల్లరాళ్లపల్లితండాకు చెందిన ఇస్లావత్ లచ్చిరాం కు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఇదే తండాకు చెందిన గోపాల్ రూ. 2 లక్షలు తీసుకున్నాడు. కానీ ఉద్యోగం ఇప్పించకపోవడంతో తన డబ్బులు తిరిగి ఇవ్వాలని లచ్చిరాం కోరగా గోపాల్ భయభ్రాంతులకు గురిచేశాడు. ఈ మేరకు పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టగా.. గత నెల 23వ తేదీన డబ్బులు ఇస్తానని గోపాల్ ఒప్పుకున్నాడు. కానీ ఇప్పటికీ ఇవ్వకపోవడంతో గోపాల్‌ను నిలదీయగా.. హైదరాబాద్‌లో ఉన్నాను, తండాలో ఉన్న తన ఇంటిలో అడగాలని సూచించాడు. లచ్చిరాం వెళ్లి డబ్బులు అడగగా గోపాల్ తల్లిదండ్రులు చిట్టి, నర్సింహ, చిన్నాన్న భాస్కర్, కృష్ణ నలుగురు కలిసి మద్యం మత్తులో దూషిస్తూ లచ్చిరాంపై కట్టెతో దాడి చేసి గాయపర్చారన్నారు. దీంతో లచ్చిరాం ఇచ్చిన పిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ఖిల్లాఘనపురం: వేసవి కాలంలో తగిన జాగ్రత్తలు తీసుకున్నప్పుడే వడదెబ్బ బారిన పడకుండా ఉంటామని కళాజాత బృందం సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించారు. బుధవారం మండలంలోని సూరాయిపల్లిలో సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం వారు ప్రజలకు పలు విషయాల గురించి వివరించారు. కళాబృందం టీం లీడర్ దప్పు నర్సింహతో పాటుగా సభ్యులు శివలింగం, సువర్ణ, రాధ, కృష్ణయ్య, రాజు, శ్రీనివాసులు, శ్రీదేవి ఆట, పాటలతో ప్రజలను చైతన్యం చేశారు. వడదెబ్బ తగిలితే, వేసవిలో తరుచుగా వచ్చే సీజనల్ వ్యాధులు, తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు, తదితర వాటి గురించి వివరించారు.

'రైతులకు అన్యాయం చేయొద్దు'

- ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి
- అజ్జకొల్లు, కొత్తకోటలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



అజ్జకొల్లులో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

మదనాపురం: పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీని సక్రమంగా లబ్ధిదారులకు అందించాలని, ఎవరైనా అక్రమాలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి హెచ్చరించారు. గతంలో మాదిరిగా అవకతవకలు చేస్తామంటే ఊరుకోమని స్పష్టం చేశారు. బుధవారం తిర్మాలయపల్లిలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంతో పాటు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

అజ్జకొల్లులో ఐకేపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు అన్యాయం చేయకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తూకాల్లో మోసాలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు, మార్కెట్ చైర్మన్ పల్లెపాగ ప్రశాంత్, తహసీల్దార్ అబ్రహాంలింకన్, ఏపీఎం తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నానగ్న తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: దేశంలో రేషన్ దుకాణాల పేదలకు సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అప్పరాలలో, కొత్తకోట పట్టణ కేంద్రంలోని 4వ రేషన్ షాపులో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, బోయేజ్, శ్రీనివాస్‌రెడ్డి, మేస్త్రీ శ్రీనివాసులు, బీచుపల్లియాదవ్, డాక్టర్ పీజే బాబు, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, సలీం ఖాన్, ముజీబ్, సుభాష్, అప్పరాల మాజీ సర్పంచ్ మాసన్న తదితరులు ఉన్నారు.

కొత్తకోట పీఏసీఎస్ ఆధ్వర్యంలో..

ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం పీఏసీఎస్ కొత్తకోట ఆధ్వర్యంలో కొత్తకోటలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ పి.ప్రశాంత్, బోయేజ్, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మేస్త్రీ శ్రీనివాసులు, పీఏసీఎస్ సీఈఓ బాలరాజు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

'కుమ్మరివాము' మార్చాలంటూ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

అమరచింత: పట్టణంలోని 3, 4 వార్డుల మధ్య ఉన్న కుమ్మరివామును అక్కడి నుంచి మార్చాలంటూ ఆయా వార్డులకు చెందిన ప్రజలు మున్సిపల్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో కాలంగా కుమ్మరివాము ఉండటంతో కుండలు కాల్చే సమయంలో వచ్చే పొగ, దుర్వాసనతో చిన్నారులతో పాటు వృద్ధులకు శ్వాసకోశ వ్యాధులు వ్యాపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కుమ్మరుల వృత్తికి తాము వ్యతిరేకులం కాదని, కుమ్మరివాము మాత్రం తరలించి తమ కాలనీ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఫయాజ్, తౌఫిక్, పాషా, నిమ్మకాయల మైనోద్దీన్, ఆయూబ్, నిసార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

వీపనగండ్ల: ఉపాధి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ఎం ఆంజనేయులు అన్నారు. బుధవారం కల్వరాలలో ఉపాధి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం విధించిన కొత్త నిబంధనలతో పలు గ్రామాల నుంచి కూలీలకు పనులు దొరకడం లేదని విమర్శించారు. ప్రభుత్వ బీడు భూముల్లోనే పనులు చేయాలని నిబంధన విధించడంతో పలువురు పేద రైతులు ఉపాధి పనులకు అర్హత పొందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని గ్రామాల్లో కూలీలకు పని దొరికే విధంగా సైడ్ కాల్వలు, మట్టి రోడ్లు, జమ్ము, షిల్ట్, కంపతార చెట్లను తొలగించే పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అలసత్వం వద్దు



వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ యాదయ్య

వనపర్తి: జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి బేస్మెంట్ వరకు పూర్తయిన వాటిని వచ్చే వారంలోపు ఫొటోలు అప్‌లోడ్ చేయాలని అదనపు కలెక్టర్ యాదయ్య అన్నారు. బుధవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై హైదరాబాద్ నుంచి రాష్ట్ర గృహ నిర్మాణ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ అన్ని జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ యాదయ్యతోపాటు డీఆర్‌డీఓ ఉమాదేవి, హౌసింగ్ పీడీ పర్వతాలు, డీఈ విఠోబా హాజరయ్యారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి బేస్మెంట్ వరకు పూర్తయిన వాటిని వచ్చే వారంలోపు ఫొటోలు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేయాలని, ఈ ప్రక్రియ పూర్తయితేనే లబ్ధిదారులకు మొదటి విడత డబ్బులు వస్తాయని చెప్పారు. ఇప్పటి వరకు అసలు నిర్మాణాలు ప్రారంభం కానీ మండలాల్లో వేగంగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఎట్టి పరిస్థితుల్లోనూ అలసత్వం వహించొద్దని చెప్పారు.

14 వరకు గడువు పొడిగింపు

వనపర్తి రూరల్: రాజీవ్ యువ వికాసం పథకం కింద అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం ఈ నెల 14 వరకు గడువు పొడిగించిందని ఎంపీడీఓ రాఘవ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో అర్హులైన యువకులు ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొని పత్రాలను ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులు భర్తీ చేయాలి

కొత్తకోట రూరల్: కొత్తకోట, మదనాపురం మండల పరిధిలో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆయాల పోస్టులను వెంటనే భర్తీ చేయాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కొత్తకోట మండలంలోని అంగన్‌వాడీ ఆయాలు ముమ్మళ్లపల్లి, పుల్లారెడ్డికుంట, పామాపురం, రాయిణిపేట, పాతజంగాయపల్లి, సంకిరెడ్డిపల్లి, కొత్తకోట పట్టణంలో ఐదు సెంటర్లలో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. మదనాపురం మండలంలోని కొన్నూరుతండా, గోపన్‌పేట, నెల్విడి, నెల్విడితండా, దంతనూరు, రామన్‌పాడ్, గోవిందహళ్లి, నర్సింగాపురం గ్రామాల్లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. కొత్తకోట పట్టణ కేంద్రంలో మరో ఆరు అంగన్‌వాడీ పోస్టులను కొత్తగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్ విజ్ఞప్తి చేశారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేస్తుందని, త్వరలోనే అన్ని సెంటర్లు ఆయా పోస్టుల భర్తీ చేస్తామన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండలంలోని కంభాళాపురం గ్రామ శివారులోని రైస్‌మిల్లు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి హైదారాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు శ్రీరంగాపురం ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వీపనగండ్ల మండలంలోని గోవర్ధనగిరికి చెందిన దుబ్బ చింతలయ్య(65) టీవీఎస్ బైక్‌పై శ్రీరంగాపురం నుంచి పెబ్బేరు వెళ్తున్న క్రమంలో కంభాళాపురం శివారులోని రైసుమిల్లు వద్ద కుక్క అడ్డు రావడంతో బైక్ అదుపుతప్పి కిందపడిన విషయం తెలిసిందే. క్షయగాత్రుడిని మొదట వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ నిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. బుధవారం మృతుడి కుమార్తె వెన్నెల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

అమరచింత: కొత్తకోట మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్‌గా అమరచింత పట్టణానికి చెందిన డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్‌ను నియమించినట్లు డీసీసీ అధ్యక్షుడు రాజేందర్‌ప్రసాద్ తెలిపారు. కొత్తకోట పట్టణంలో బుధవారం నిర్వహించిన జై బాపు, జైభీమ్ సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, దేవరకద్ర, మక్తల్ ఎమ్మెల్యేలు మధుసూసుదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ ఆదేశానుశారం ఆయూబ్‌ఖాన్‌ను మండల కోఆర్డినేటర్‌గా నియమించినట్లు పేర్కొన్నారు. మండలంలో పార్టీ బలోపేతంతో పాటు పార్టీ తీసుకుంటున్న కార్యక్రమాలు అమలు చేసేందుకు తనవంతు కృషి చేస్తానని ఆయూబ్‌ఖాన్ తెలిపారు.

ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు సంక్షేమం



అమరచింతలో లబ్ధిదారులకు సన్నం బియ్యం అందిస్తున్న అధికారులు, నాయకులు

ఖిల్లాఘనపురం/గోపాల్‌పేట: రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం రావడం పేదలకు ఓ వరమని, శ్రీమంతుల మాదిరిగా నిరుపేదలు కూడా నాణ్యమైన భోజనం చేయాలనే సంకల్పంతో సన్నబియ్యం పంపిణీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. బుధవారం వనపర్తి నియోజకవర్గంలోని ఖిల్లాఘనపురం మండల కేంద్రంలోని 2వ, గోపాలపేట మండల కేంద్రంలోని బంగారమ్మ గడ్డ కాలనీలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పేదల సంక్షేమమే లక్ష్యంగా అనేక పథకాలను కొనసాగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ సుబ్రమణ్యం, తహసీల్దార్లు సుగుణ, తిలక్ కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటాచారి, గోపాల్‌పేట ఉమ్మడి మండల ఇన్‌చార్జి సత్యశీలారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు విజయ్‌కుమార్, పర్వతాలు, సింగల్‌విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు క్యామ రాజు, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు ఆగారం ప్రకాష్, గంజాయి రమేష్, వెంకటేశ్వర్‌రావు, విజయలక్ష్మి, శ్యాంసుందర్‌రెడ్డి, వాస నాగేశ్వర్, రవినాయక్, మునగాల బాబు, లింగస్వామి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: మండల కేంద్రంలో బుధవారం తహసీల్దార్ రవియాదవ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్ చేతుల మీదుగా రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ మహంకాళి విష్ణు, పోసిరిగారి విష్ణు, హనుమంతు నాయక్, ప్రకాశం, తౌఫిక్ పాల్గొన్నారు.

రేషన్ దుకాణాలకు సన్న బియ్యం



పాన్‌గల్ స్టాక్ పాయింట్ గోదాం వద్ద లారీలో సన్నబియ్యం లోడ్ చేస్తున్న దృశ్యం

పాన్‌గల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ పథకంలో భాగంగా మండల కేంద్రంలోని స్టాక్ పాయింట్ గోదాం నుంచి సన్న బియ్యం గ్రామాల్లోని రేషన్ దుకాణాలకు తరలిస్తున్నట్లు స్టాక్ పాయింట్ ఇన్‌చార్జీ ఆంజనేయులు బుధవారం తెలిపారు. మండలంలోని 35 దుకాణాలకు గాను ఇప్పటి వరకు 25 దుకాణాలకు సన్న బియ్యం తరలించామని, మిగిలిన దుకాణాలకు కూడా త్వరలోనే సరఫరా చేస్తామన్నారు. చిన్నంబావి, వీపనగండ్ల మండలాల రేషన్ దుకాణాలకు సైతం బియ్యం తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పాన్‌గల్ మండలానికి 2,780 క్వింటాళ్లు, చిన్నంబావి మండలానికి 1,632 క్వింటాళ్లు, వీపనగండ్ల మండలానికి 1,538 క్వింటాళ్ల బియ్యాన్ని కేటాయించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఆత్మకూర్: మండలంలోని గ్రామాల్లో రేషన్ షాపుల్లో లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం బుధవారం ప్రారంభమైందని తహసీల్దార్ చాంద్‌పాష తెలిపారు. ఖానాపూర్‌లో సన్నబియ్యం పంపిణీని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో డీలర్ బాలస్వామి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠాపనోత్సవ పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆత్మకూర్: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠ పూజలను ప్రముఖ వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ నెల 4న శుక్రవారం శ్రీపంచముఖ ఆంజనేయస్వామి, నాగదేవత, రమాసత్యనారాయణ స్వామి, శిఖర కలశ ప్రతిష్ఠమహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పూజల్లో భాగంగా బుధవారం గోపూజ, గణపతిపూజ, పుణ్యవాహచనం, నంది, మాతృకపూజ, పంచగవ్యము, ఆచార్య దీరుత్విక్‌వరనం, దీక్షధారణం, యాగశాల ప్రవేశం, అఖండదీపస్థాపనం, అంకురార్పణ, మృత్సంగ్రహణం, దీక్షాహోమం, ప్రతిష్ఠామూర్తులకు రక్షాబంధనం, మహామంగళహారతి తదితర పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం ప్రత్యేక పూజలు, శుక్రవారం ప్రతిష్ఠమహోత్సవం జరుగుతుందని, భక్తులు వేలాదిగా పాల్గొనాలని నిర్వాహకులు తాండూర్ మోహిని, సహదేవుడు, రమేష్ శెట్టి, యాదగిరిశెట్టి కోరారు.

కార్పొరేషన్ బకాయిలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు

పాన్‌గల్: గిరిజన కార్పొరేషన్ పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, లేనిచో ఈనెల 7న హైదరాబాద్ బంజారా భవనాన్ని ముట్టడిస్తామని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బాల్యనాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గిరిజన కార్పొరేషన్‌కు ఎంపికైన లబ్ధిదారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2019 నుంచి 2021 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం గిరిజన కార్పొరేషన్ రుణాలకు జిల్లాలో సుమారుగా 250 మందిని ఎంపిక చేసిందన్నారు. ఎంపిక చేసిన లబ్ధిదారులకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రుణాలు ఇవ్వకుండా రాజీవ్ యువ వికాసం పేరుతో గతంలోని రుణాలను రద్దు చేసేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. గతంలో ఎంపికై న గిరిజనులకు కార్పొరేషన్ రుణాలను ఇవ్వాలని, వాటి సాధన కోసం లబ్ధిదారులతో కలిసి ఈనెల 7వ తేదీన హైదరాబాద్ బంజారా భవనాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో రవినాయక్, బాలునాయక్, నానునాయక్, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమైక్య పోరాటాల ద్వారానే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న మండ్ల రాజు

వీపనగండ్ల: ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు సమైక్య పోరాటాలు నిర్వహించడం ద్వారానే వారి సమస్యలను పరిష్కరించుకోగలరని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రప్రభుత్వం ఎన్నికల సమయంలో కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇస్తానని ప్రకటించి, ఆ తర్వాత పట్టించుకోలేదని విమర్శించారు. హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు, ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తామని హామీనా మొండిచేయి చూపించారని విమర్శించారు. మే 20 తేదీన సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆందోళనలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఆశన్న, బాలగౌడ్, రంగస్వామి, బాలకృష్ణాచారి, సుగుణబాయ్, వెంకటయ్య, మధు, సువర్ణ, రాధ, నీరజ, ఆంజనేయులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి పాపన్నగౌడ్



ఖిల్లాఘనపురంలో పాపన్నగౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

సాక్షి, నెట్‌వర్క్: 12 మంది వీరులతో మొదలైన ఉద్యమం 18 లక్షలకు చేరుకొని, ఆనాటి మొఘల్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పోరాటాలు మరవలేనివని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. పాపన్న గౌడ్ 315వ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా నాయకులు ఆయన చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ మొఘల్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి 31 కోటలను జయించిన మహావీరుడు పాపన్న గౌడ్ అని కొనియాడారు.

- వనపర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో, ఖిల్లాఘనపురం మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో పాపన్నగౌడ్ చిత్రపటానికి ఎమ్మెల్యే మేఘారెడ్డి, నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, లక్కాకుల సతీష్, బాలాంజనేయులుగౌడ్, కృష్ణయ్యగౌడ్, రామకృష్ణగౌడు, డాక్టర్ నరేందర్‌గౌడ్, వెంకట్‌రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తకోట చౌరస్తాలో..

- వనపర్తి మండలంలోని కడుకుంట్లలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లులర్పించారు. కార్యక్రమంలో తిరుపతయ్యగౌడ్, మహేష్‌గౌడ్, విజయకుమార్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.
- కొత్తకోట పట్టణ చౌరస్తాలో బుధవారం గౌడ సంఘం నాయకులు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, వెంకటన్నగౌడ్, తిరుపతన్నగౌడ్, చెన్నకేశవరెడ్డి, కొమ్ము భరత్‌భూషణ్, పబ్బా నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ భూములను కాపాడుకుందాం



జిల్లా కేంద్రంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్‌వీ, బీఆర్‌ఎస్ నాయకులు



మాట్లాడుతున్న మంగ లావణ్య

వనపర్తి విద్యావిభాగం: హెచ్‌సీయూ విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌరస్తా నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌వీ జిల్లా కో ఆర్డినేటర్ హేమంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రజాపాలన పేరుతో హెచ్‌సీయూ క్యాంపస్‌లోని 400ఎకరాల బయో డైవర్సిటీ స్థలాన్ని బుల్డోజర్లతో మట్టికరిపిస్తున్నారని, నియంత పాలన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి రోజులు దగ్గర పడ్డాయన్నారు. కార్యక్రమంలో గట్టుయాదవ్, వాకిటి శ్రీధర్, ఆశోక్, ప్రేమ్‌నాథ్ రెడ్డి, ఇమ్రాన్, మహేశ్వర్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, రాము తదితరులు ఉన్నారు.

అమరచింత: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని 400 ఎకరాల భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం రూ.40 వేల కోట్లకు అమ్ముకునేందుకు ప్రయత్నిస్తుందని బీజేపీ మండల అధ్యక్షురాలు మంగ లావణ్య ఆరోపించారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించిన ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పనితీరును తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. హెచ్‌సీయూ భూములను స్వాధీనం చేసుకోవాలని చూడడం దుర్మార్గమైన చర్యలని మండిపడ్డారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కోకాపేట భూములను అప్పనంగా అమ్ముకొని రాష్ట్రంలో అభివృద్ధి పనులు చేసేందుకు ప్రభుత్వ భూములు లేకుండా చేసిందన్నారు. విద్యార్థులు ఒక్కసారిగా రోడెక్కితే ప్రభుత్వం పతనమవుతుందని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర నాయకుడు మేర్వరాజు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నరాల నారాయణ, కుర్వ హరీష్, విజయ్‌యాదవ్, మంగ అంజి, వెంకటేష్, లడ్డుసత్తి తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారిణికి అభినందన

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని అనకాయపల్లితండా పరిధిలోని పిల్లిగుండ్లతండాకు చెందిన రెడ్యానాయక్, జ్యోతి కుమార్తె ఇస్లావత్ అనూష ఇటీవల బీహార్‌లో జరిగిన జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికైంది. దీంతో బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యుడు తూడి మేఘారెడ్డి అనూషను శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ శంకర్‌నాయక్, కాంగ్రెస్ వనపర్తి మండల అధ్యక్షులు రవికుమార్, పెద్దమందడి మాజీ వైస్ ఎంపీపీ భారతి ఆంజనేయులు నాయక్, వెంకటేష్ నాయక్, గోపాల్ నాయక్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.